సాక్షి
ఏలూరు

గురువారం । 3 । ఆగస్టు । 2023



గ్రామాల్లోనే వైద్యం

జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్ని ఆశ్రయించే పరిస్థితి తప్పింది. 8లో ▸



గంజాయి అడ్డుకట్టకు చర్యలు

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ఆమె సందర్శించారు. 8లో ▸



నారుమడుల పరిశీలన

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో నీటమునిగిన పంట చేలను వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి గురువారం పర్యటించారు.

స్కూలు పరీక్షల్లో ఓఎంఆర్ షీట్లు

- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో నూతన పరీక్షల విధానం
- పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యేందుకు ఉపయోగం





అంతర్గత పరీక్షల్లో విద్యార్థులకు ఇచ్చే ఓఎంఆర్ జవాబు పత్రాలు, ఓఎంఆర్ షీట్లపై జవాబులు రాస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ విద్యారంగంలో జగన్‌కు పూర్వం, జగన్ శకం అని చెప్పుకునేంతగా అభివృద్ధి జరిగిందని విద్యావేత్తలు ముక్తకంఠంతో ఒప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన విప్లవాత్మక పథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలకు మార్గదర్శకంగా, ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయనడంలో సందేహమే లేదు. మన బడి నాడు – నేడు, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అందరి మన్ననలు అందుకుంటున్నాయి. ఇప్పుడు స్కూలు అంతర్గత పరీక్షల్లో ఓఎంఆర్ పరీక్షా విధానం అవలంబించడాన్ని కూడా ప్రశంసిస్తున్నారు. విద్యార్థులు పదో తరగతి వరకూ చదివేది ఒక ఎత్తు, అనంతరం ఇంటర్మీడియట్, డిగ్రీ మరో ఎత్తు.. డిగ్రీ అనంతరం ఉద్యోగాల కోసం ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలకు తప్పనిసరిగా వెళ్ళాల్సిందే. ఒకేసారి పోటీ పరీక్షలకు వెళ్లడం విద్యార్థులకు తలకుమించిన భారం. పోటీ పరీక్షల్లో మంచి ప్రదర్శన ఇస్తేనే మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశముంటుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్షల్లో నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ రాతపూర్వక పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేవారు. ఇకపై తరగతి గది ఆధారిత మూల్యాంకనం (క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్) విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అంతర్గత పరీక్షల్లో ఓఎంఆర్ షీట్ల విధానం

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే అంతర్గత పరీక్షల్లో ఓఎంఆర్ జవాబు పత్రాల విధానాన్ని ప్రభుత్వం గత ఏడాది ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ విధానం ద్వారా విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఓఎంఆర్ పత్రాలపై జవాబులు రాయడంలో గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా చేయవచ్చు. కార్పొరేట్ విద్యా సంస్థలు ఎప్పటి నుంచో ఈ విధానాన్ని తమ విద్యార్థులకు పరిచయం చేయగా గత ప్రభుత్వాలు ఆ దిశగా అసలు ఆలోచనే చేయలేదు. చిన్నప్పటి నుంచే ఈ విధానం అలవాటు పడితే జేఈఈ వంటి పరీక్షలను విద్యార్థులు సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ప్రశ్నాపత్రాలు

ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్గతంగా నిర్వహించే ఫార్మేటివ్, సమ్మేటివ్ వంటి పరీక్షల్లో విద్యార్థులకు అందించే ప్రశ్నాపత్రాల్లో సైతం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆయా పరీక్షల ప్రశ్నాపత్రాలను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో రూపొందించి విద్యార్థులకు అందచేస్తోంది. కాగా 1 నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం ఏడాదికి మూడు సార్లు తరగతి గది ఆధారిత మూల్యాంకన (సీబీఏ) పరీక్షలు నిర్వహిస్తున్నారు. 9, 10 తరగతులకు మాత్రం పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

విద్యా ప్రమాణాలు పెరుగుతాయి



పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న నూతన పరీక్షల విధానం వల్ల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరుగుతాయి. ఓఎంఆర్ షీట్ల నింపడంతో సందేహాలను చిన్న వయసులోనే నివృత్తి చేసుకుంటే భవిష్యత్‌లో ఉన్నత చదువుల సమయంలో ఎంతో ఆత్మ విశ్వాసంతో ఆయా పరీక్షలను రాయవచ్చు.

– వల్లమూడి రామ్మోహన రావు, వైఎస్ఆర్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండు భాషల్లో ప్రశ్నాపత్రాలు మంచి నిర్ణయం



అంతర్గత పరీక్షల్లో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రశ్నాపత్రాలు ఇవ్వడం మంచి నిర్ణయం. దీని వల్ల విద్యార్థులు ప్రశ్నలను సులువుగా అర్థం చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఓఎంఆర్ షీట్ల ద్వారా నిర్వహించే పరీక్షలతో విద్యార్థులకు పోటీ పరీక్షలంటే భయాందోళనలు తొలగిపోతాయి.

– రూపావత్ రంగయ్య, మండల విద్యాశాఖాధికారి –2, ఏలూరు

పోటీ పరీక్షలకు సంసిద్ధత



ఓఎంఆర్ జవాబు పత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించడం వల్ల భవిష్యత్‌లో పోటీ పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉంటాడు. ప్రస్తుతం జరుగుతున్న ఫార్మేటివ్ పరీక్షల్లో ఈ విధానాన్నే అవలంబిస్తున్నాం. ఈ విధానం వల్ల పరీక్షల్లో ఓఎంఆర్ షీట్లలో పెన్సిల్‌తో దిద్దడానికి పట్టే సమయంపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడుతుంది.

– పీ శ్యామ్ సుందర్, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జగన్నాథపురంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రాజెక్టుల సందర్శన పేరిట ముచ్చుమర్రు పర్యటనకు చంద్రబాబు వెళ్లడంతో పచ్చమీడియా ఎంతో హడావిడి చేసిందని, పర్యటనలో అసలు బండారం బయటపడిందని, చంద్రబాబు కారు వెనక పది మంది కూడా లేరని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. బుధవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంత రైతులకు చంద్రబాబు న్యాయం చేసి ఉంటే తండోపతండాలుగా రావాలని, ఆ పరిస్థితి కానరాలేదన్నారు. ఆ ప్రాంతంలో చంద్రబాబుకు ఎంత క్రేజ్ ఉందో తెలుస్తుందన్నారు. చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు రాజకీయం ఏమైందని ప్రశ్నించారు. జగన్‌పై సంపూర్ణ నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. చంద్రబాబును ప్రజలు దద్దమ్మ కింద లెక్కేసారని దుయ్యబట్టారు. రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ పాతాళానికి వెళ్ళిపోయిందన్నారు. అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, 2024 ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబుకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

న్యూస్‌రీల్

రూ. 30లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



కాకర్లమూడిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: కాకర్లమూడిలో కంచర్ల సులోమికి రూ.30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బుధవారం అందించారు. కంచర్ల సులోమికి జన్మించిన కవలలకు అనారోగ్య సమస్యల వల్ల లక్షలాది రూపాయలు ఖర్చయ్యాయి. గ్రామానికి చెందిన కూనా రాజు ద్వారా సులోమి ఎమ్మెల్యే వాసుబాబును ఆశ్రయించారు. వాసుబాబు సీఎంతో మాట్లాడి రూ.30 లక్షల మంజూరు చేయించారు. చెక్కును స్వయంగా ఎమ్మెల్యే వాసుబాబే కాకర్లమూడి వెళ్ళి బాధితుల ఇంటివద్ద అందజేశారు. చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరిన చిన్నారులను వాసుబాబు ఎత్తుకుని ముద్దాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, పార్టీ పంచాయితీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు వరం



దెందులూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలకు గొప్ప వరమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో గర్భిణులు, బాలింతలైన అక్కచెల్లెమ్మలందరికీ సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం పోషక పదార్థాలు ఇంటికే వెళ్లి ఇచ్చేలా చేయడం స్ఫూర్తి దాయకమని ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ గర్భిణులు, బాలింతలకు ఈ తరహా మేలు చేసిన ముఖ్యమంత్రి దేశంలోనే ఎవరూ లేరు అన్నారు. ఏలూరు జిల్లాలో ఉన్న పది ప్రాజెక్టుల్లో 2,225 అంగన్‌వాడీ కేంద్రాల్లో 19,056 మంది గర్భిణులు, బాలింతలైన అక్కచెల్లెమ్మలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకుండా ముఖ్యమంత్రి వెసులుబాటు కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

హైస్కూల్ ప్లస్ పాఠశాల తనిఖీ



పూళ్ల ఉన్నత పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకుంటున్న

భీమడోలు: నూతన విద్యా విధానంలో ఎంపికైన హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్ కోర్సులు అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఇంటర్ బోర్డు రీజనల్ తనిఖీ అధికారి బి.ప్రభాకరరావు అన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇంటర్ కళాశాల కేంద్రాన్ని మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఇంటర్ బోర్డుకు ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ ఇంటర్ కళాశాల మంజూరు చేసేందుకు అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతులపై పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆటస్థలం, నిర్మిస్తున్న అదనపు తరగతుల నిర్మాణ పనులు పరిశీలించారు. పూళ్ల పాఠశాలలో ఈ ఏడాది 136 మంది పదో తరగతి పరీక్షలు రాస్తారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.మోహన్ రీజనల్ తనిఖీ అధికారికి వివరించారు.

శ్రీవారి సేవలో సాయిధరమ్ తేజ్



ద్వారకాతిరుమలలో సాయిధరమ్ తేజ్‌కు స్వామి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం రూరల్/భీమవరం (ప్రకాశంచౌక్): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ హీరో సాయిధరమ్ తేజ్ బుధవారం ఉదయం సందర్శించారు. శ్రీవారి ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని సాయిధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. అలాగే భీమవరంలోని మావుళ్లమ్మ గుడిని కూడా దర్శించుకున్నారు.

మిషన్ ఇంద్రధనుస్సును విజయవంతం చేయాలి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మిషన్ ఇంద్రధనుస్సును సమర్థవంతంగా అమలు చేస్తూ మీజిల్స్, రుబెల్లా రహిత జిల్లాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుస్సు 5.0 నిర్వహణపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ జూమ్ సమావేశం నిర్వహించింది. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ప్రతి నెలలో ఆరు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ మిషన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 7 నుంచి 12 వరకూ మొదటి విడత, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకూ రెండో విడత, అక్టోబర్ 9 నుంచి 14 వరకూ మూడో విడతగా వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత్, డీఈఓ శ్యామ్‌సుందర్, డీపీవో టీ.శ్రీనివాస విశ్వనాథ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ పాల్గొన్నారు.

ముంపు నుంచి తేరుకున్న పొలాలు

పోలవరం రూరల్: గోదావరి వరద సాధారణ స్థితికి చేరుకుంది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గింది. నదిలో వరద నీటి మట్టం కూడా రోజురోజుకు తగ్గుతోందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద 25.90 అడుగులకు నీటిమట్టం చేరింది. దిగువన పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 29.560 మీటర్ల మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. స్పిల్ వే నుంచి 4,17,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. పోలవరం గ్రామంలో గోదావరి ఎగపోటు నీటితో పాటు కొండవాగుల నీటితో ముంపునకు గురైన పొలాలు ముంపు నుంచి పూర్తిగా బయటపడ్డాయి. నీరంతా కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి చేరుతోంది. రైతులు పొలాలకు చేరుకుని ఆకుమడులను సరిచూసుకుంటూ, నాట్లకు సిద్ధమవుతున్నారు.

వేలేరుపాడు మండలంలో జేసీ పర్యటన

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం చిగురుమామిడి, బోళ్ళపల్లి వరద ప్రభావిత గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పర్యటించారు. ప్రభుత్వం తరపున అందిన నిత్యావసర వస్తువులు, కూరగాయల పంపిణీపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. చిగురుమామిడిలో దాసబోయిన మంగమ్మను పరామర్శించి వారికి అందిన నిత్యావసర వస్తువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



పోలవరంలో వరద ముంపు నుంచి బయటపడ్డ పొలాలు



చిగురుమామిడిలో వరద బాధితులతో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఇంతవరకు 8,805 క్వింటాళ్ల బియ్యం పంపిణీ

గోదావరి వరదల నేపథ్యంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని బియ్యం కార్డుదారులకు మూడు నెలలకు సరిపడా 8,805 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది లబ్ధిదారులు గ్రామంలో లేని కారణంగా రేషన్ తీసుకోలేదన్నారు. కుక్కునూరు మండలంలో 5,268 క్వింటాళ్ల బియ్యం, వేలేరుపాడు మండలంలో 3,537 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. వరద బాధితులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కూరగాయలు అందించారు. జిల్లా యంత్రాంగం వేలేరుపాడు, కుక్కునూరు ముంపు మండలాల్లో సహాయక చర్యలు అందిస్తుందన్నారు. అధికారుల సూచనల మేరకు స్థానిక వీఆర్‌ఓలు, సచివాలయాల సిబ్బందితోపాటు ఇతర మండలాల నుంచి సిబ్బంది వరద ప్రభావిత గ్రామంలోనే ఉంటూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

వరద బాధితులకు అండగా..

ఏలూరు(మెట్రో): గోదావరి వరద ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, బాధితులకు అండగా ఉంటామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యతతో కూడిన కూరగాయలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. వరద బాధితులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామన్నారు. వరద బాధితులకు ముందుగానే మూడు నెలల ముందస్తు బియ్యం పంపిణీ చేశామని చెప్పారు.

నాడు పడిగాపులు.. నేడు ఇంటికే పింఛన్



నాడు



నేడు

ఉదయం వెళ్తే సాయంత్రమైనా పట్టించుకునే నాథుడే లేడు అన్నట్లుగా ఉండేది నాడు పింఛన్ల పంపిణీ.. తిండీతిప్పలు మానేసి పంచాయతీ ఆఫీసు వద్దే పడిగాపులు కాసేవారు. అక్కడకు వెళ్ళి కూర్చుంటే.. వేలిముద్రలు పడడం లేదని తిప్పేవారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కోడి కూయకముందే ఒకటో తారీఖునే పింఛన్ ఇచ్చేలా చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

వైఎస్సార్ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం

టేక్ హోం రేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే, జేసీ



కైకలూరులో టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, జేసీ లావణ్యవేణి

కైకలూరు: మహిళలకు బలమైన పౌష్టికాహారం అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి బుధవారం ప్రారంభించారు. ముందుగా జిల్లా ఐసీడీఎస్ పీడీ పద్మావతి అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అనంతరం లబ్ధిదారులు ఎస్.అపర్ణ, పి.రజనీలు ప్రభుత్వం నుంచి పొందిన మేలును సభకు వివరించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గతంలో పౌష్టికాహారాన్ని అందజేసేవారని ఇందులో ప్రభుత్వం మార్పులు చేసి వారి ఇళ్లవద్దకే పది రకాల పౌష్టికాహార వస్తువులు – పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేయటం సీఎం దూరదృష్టికి నిదర్శనమన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కింద 21,555 మంది గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లు అందిస్తున్నారన్నారు. ఏలూరు జిల్లాలో 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,225 సెంటర్లలో టేక్ హోం రేషన్ పథకం ద్వారా 9,334 మంది గర్భవతులు, 7519 మంది బాలింతలకు అలాగే గిరిజన మండలాల్లో 2,492 మంది గర్భిణులు, 2210 మంది బాలింతలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కిట్‌లో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు పామాయిల్, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, పావుకిలో వేరుశనగ చిక్కీలు, పావుకిలో ఖర్జూరం, 25 కోడిగ్రుడ్లు(13 గుడ్లు ఒకసారి, 12 గుడ్లు మరోసారి) అందిస్తారన్నారు. గిరిజన మండలాల్లో అదనంగా రెండు కిలోల మల్టీగ్రైన్ ఆటా, పావుకిలో వేరుశనగ చిక్కీ, పావుకిలో బెల్లం అదనంగా ఇస్తున్నామన్నారు. ముందుగా అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ మంగర విజయనిర్మల, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, రాచూరి రాధ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక అధికారుల నియామకం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల నమోదుకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 నియోజకవర్గాల్లో కొవ్వూరు నియోజకవర్గానికి కొవ్వూరు ఆర్డీవో, నిడదవోలు నియోజకవర్గానికి కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆచంట నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, పాలకొల్లు నియోజకవర్గానికి నరసాపురం డీఎల్‌డీవో, నరసాపురం నియోజకవర్గానికి నరసాపురం సబ్‌కలెక్టర్, భీమవరం నియోజకవర్గానికి భీమవరం ఆర్డీవో, ఉండి నియోజకవర్గానికి పశ్చిమ గోదావరి జిల్లా డీపీవో, తణుకు నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యానవన శాఖాధికారిని నియమించింది. ఉంగుటూరు నియోజకవర్గానికి ఏలూరు ఆర్డీవో, దెందులూరు నియోజకవర్గానికి కేఆర్‌ఆర్ డిప్యూటీ కలెక్టర్, ఏలూరు నియోజకవర్గానికి జెడ్పీ సీఈవో, గోపాలపురం నియోజకవర్గానికి ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పోలవరం నియోజకవర్గానికి జంగారెడ్డిగూడెం ఆర్డీవో, చింతలపూడి నియోజకవర్గానికి ఏలూరు ఆర్ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

మినీ వ్యాన్‌ను ఢీకొన్న ట్రాక్టర్
ముగ్గురికి స్వల్పగాయాలు



ట్రాక్టర్ ఢీకొనడంతో దెబ్బతిన్న మినీ వ్యాన్ ముందు భాగం

ఆకివీడు: ఉప్పుటేరు వంతెన సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆకివీడు నుంచి కై కలూరు వైపు ఉప్పుటేరు వంతెన ఎక్కుతున్న ట్రాక్టర్, మందపాడు రోడ్డు నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి ఎదురుగా ఆకివీడు నుంచి భువనపల్లి వెళుతున్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, మరో ఇద్దరు గాయాలపాలై చిక్కుకుపోగా, స్థానికుల సాయంతో బయటకు తీశారు.

వ్యాపారి అరెస్టు.. నిషేధిత సిగరెట్ల స్వాధీనం



మాట్లాడుతున్న విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్

తాడేపల్లిగూడెం: విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో ఓ వ్యాపారిని అరెస్టు చేసి అతని నుంచి నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సతీష్ అనే వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు బుధవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో వ్యాపారి సతీష్ ఇంట్లో సుమారు రూ.4.03 లక్షల విలువైన 8075 పెట్టెల నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్పీతో సీఐ విల్సన్, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు గ్రామాల్లోనే వైద్యం

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల్లో పరీక్షలు, వైద్య సేవలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు



భీమవరం మండలం శ్రీరామపురం విలేజ్ క్లినిక్‌లో జ్వరాలకు సేవలు అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): వర్షాకాలం వస్తే సీజనల్ వ్యాధులు చుట్టుముడతాయి. ఈ సీజన్‌లో దగ్గు, జలుబు, జ్వరంతోపాటు మలేరియా, డెంగీ వంటి జ్వరాలు కూడా విజృంభిస్తాయి. అయితే సీజనల్ వ్యాధులను ఆదిలో నియంత్రించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు జ్వరం, ఇతర సాధారణ వ్యాధులు సోకితే స్థానికంగానే వైద్య సేవలు సకాలంలో అందిస్తున్నారు.

విలేజ్ క్లినిక్‌ల్లో పరీక్షలు, వైద్య సేవలు

జిల్లాలో 345 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ క్లినిక్‌ల్లో 14 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేసి వెంటనే వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరాలు ఉన్నాయనే దానిపై ఆశాలు, ఏఎన్‌ఎంలు సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వారిని విలేజ్ క్లినిక్‌లకు తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

పీహెచ్‌సీలలో మెరుగైన సేవలు

రోగులకు మెరుగైన వైద్యం అవసరం అయితే స్థానిక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇన్ పేషెంట్‌గా ఉంచి వైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం జ్వరాలపై పీహెచ్‌సీ వైద్యులు దృష్టిపెట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లకు వెళ్లి జ్వరాల కేసులు గురించి తెలుసుకుని విజృంభించకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ప్రైవేట్ ఆస్పత్రులే గతి

గత ప్రభుత్వంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే ప్రైవేట్ ఆస్పత్రులే గతి. జలుబు, దగ్గు, జ్వరం వస్తే స్థానికంగా వైద్యం అందే మార్గం లేక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లేవారు. పరీక్షల కోసం రూ.500 నుంచి రూ.1000 ఖర్చు చేసేవారు. డాక్టర్ ఫీజు, మందుల ఖర్చు మరో రూ.1300 నుంచి రూ.1500 ఖర్చు చేసేవారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకితే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు జ్వరాలకు, దగ్గు, జలుబు వంటి వాటికి విలేజ్ క్లినిక్‌ల్లో వైద్యం అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య సేవలు పొందడం సంతోషంగా ఉందంటున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు

వశిష్ఠ గోదావరి ఉధృతితో ఆచంట, యలమంచిలి, నర్సాపురం మండలాల్లోని పలు లంక గ్రామాలు వరద ముంపునకు గురికావడంతో ఆయా గ్రామాల్లోని స్థానిక విలేజ్ క్లినిక్‌లలో, ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

జ్వరాలపై సర్వే పూర్తి

జిల్లాలో ముందస్తుగానే జ్వరాలపై వైద్య ఆరోగ్య శాఖ సర్వే చేపట్టింది. ఈ సర్వే ఇటీవల పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా సాధారణ జ్వరాల కేసులు 200 వరకు ఉన్నట్లు గుర్తించారు.

జిల్లాలో ఆస్పత్రులు వివరాలు:		
జిల్లా ఆస్పత్రి	:	1
ఏరియా ఆస్పత్రులు	:	4
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	:	32

సద్వినియోగం చేసుకోవాలి



జ్వరాలు, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులకు స్థానికంగా ఉన్న విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు వినియోగించుకోవాలి. మెరుగైన వైద్యం అవసరమైతే పీహెచ్‌సీల్లో వైద్య సేవలను ఉపయోగించుకోవాలి. విలేజ్ క్లినిక్‌ల్లో ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో 25 ప్రత్యేక మెడికల క్యాంపులు ఏర్పాటు చేశాం.

డాక్టర్ మహేశ్వరరావు,
జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం

వరి చేలల్లో వర్షపు నీటిని మళ్లించండి



కానుకొల్లులో పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మండవల్లి: భారీ వర్షాల వల్ల వరిచేలల్లో చేరిన వర్షపు నీటిని బయటకు మళ్లించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. కానుకొల్లులో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం బుధవారం పర్యటించి వర్షాలకు మునిగిన వరి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు టి.సుజాత, కె.ఫణికుమార్, కేవీకే ఉండి శాస్త్రవేత్త ఎ.రాజేష్, ఏలూరు డీఆర్‌సీ ఏడీఏ పి.లలిత సుధ, మండవల్లి ఏడీఏ జి.వెంకట మణి, ఏఓ ఎస్‌కే జరీనా రైతులతో మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ముంపు నీరు చేల నుంచి బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్లు రాకుండా కార్బండిజం 1 గ్రాము, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ముదురు నాట్లు వేసే రైతులు చదరపు మీటరుకు ఎక్కువ కుదుళ్లు ఉండేలా కుదురుకు 3, 4 మొక్కలు ఉండేలా దగ్గర దగ్గరగా నాట్లు వేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి
- జంగారెడ్డిగూడెం స్టేషన్, సర్కిల్ కార్యాలయాల తనిఖీ



జంగారెడ్డిగూడెంలో డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

జంగారెడ్డిగూడెం: యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఆమె సందర్శించారు. స్టేషన్లలో రికార్డులను పరిశీలించి, కేసుల తీరుతెన్నులను డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం రావడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీల ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌ను విజిట్ చేసి కేసుల తీరు తెన్నులను తెలుసుకుంటూ సిబ్బందికి సూచనలు ఇస్తున్నామన్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో గత 15 రోజుల వ్యవధిలో 3 గంజాయి కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల్లో 28 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు ఎక్కువగా యువత బానిస అవుతుండటం గమనించామని, దీనిని నివారించేందుకు కళాశాలల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కాలేజ్‌ల వద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడినా, అమ్ముతున్నా అటువంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులకు తెలిజేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయికి సంబంధించిన సమాచారం 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రజలు సైతం సహకరించాలని, ముఖ్యంగా యువత తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. అనంతరం ఆమె ఎస్సై, పోలీస్ క్వార్టర్లను పరిశీలించారు. క్వార్టర్ల మరమ్మతులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో చర్యలు చేపడుతామన్నారు. ఇక జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, రూరల్ పోలీస్‌స్టేషన్ అవసరం ఉందని పేర్కొన్నారు. డీఎస్పీ ఎం.ధనుంజయుడు, సీఐ పి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



ఉంగుటూరు: కైకరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్యను వింటున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పెదపాడు: పాతముప్పర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

వైభవంగా వెంకన్న కల్యాణం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో అధిక శ్రావణమాసం శ్రవణా నక్షత్ర మహోత్సవం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, కన్యావరణం, లగ్నాష్టకములు, కన్యాదానం, మాంగల్య ధారణ, అక్షతారోపణ మొదలగు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐదుగురు జంటలు ఉభయదారులుగా ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నట్లు కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలియజేశారు. శ్రవణా నక్షత్ర సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని కల్యాణాన్ని వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జె.సత్యసుధామ

భీమవరం (ప్రకాశం చౌక్): కార్మికులకు పనికి తగిన వేతనం అందేలా, కార్మిక సమస్యలు పరిష్కరించి, నిబంధనలు పాటించని ఫ్యాక్టరీల యాజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సత్యసుధామ బుధవారం భీమవరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా, వివిధ ఫ్యాక్టరీల తనిఖీలలో భాగంగా ఇటీవల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు మూడు ఫ్యాక్టరీలను తనిఖీ చేయగా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఎస్సీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పనికి సమాన వేతనం, సోషల్ సెక్యూరిటీ, బీమా వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గతంలో కాళ్ల మండలంలో ఆక్వా ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఫ్యాక్టరీ గేట్ల ముందు ఆందోళనలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పొల్యూషన్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీల తనిఖీలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వర్షాకాలంలో ఫ్యాక్టరీల నుంచి దుర్గంధం, విషవాయువులతో కూడిన మురుగు విడుదలవుతున్నాయన్నారు. దీని వల్ల ఈ ఫ్యాక్టరీల చుట్టుపక్కల నివశించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఉండి మండలం వాండ్రం, కాళ్ల మండలం సీసలిలో ఫ్యాక్టరీల వద్ద ఈ పరిస్థితి తీవ్రంగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో కార్మిక శాఖ అధికారులతో కలసి నిబంధనలు అమలు చేయని ఫ్యాక్టరీలను తనిఖీలు చేసి వాటిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కటికతల రాజారావు, ఉమెన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికుల పర్సుల చోరీ
రూ.34,800 నగదు, 2 బంగారపు ఉంగరాలు, 2 సెల్‌ఫోన్ల అపహరణ

నూజివీడు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ బయట ఉన్న నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద బుధవారం ముగ్గురు మహిళా ప్రయాణికుల బ్యాగ్‌ల నుంచి పర్సులు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన వనజాక్షి, మరో ఇద్దరు మహిళలు విజయవాడ వెళ్లేందుకు పుట్రేల నుంచి నూజివీడు బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇక్కడి నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద టికెట్లు తీసుకుని బస్సు ఎక్కారు. తరువాత వీరు తమ బ్యాగ్‌లు చూసుకోగా పర్సులు కనిపించకపోవడాన్ని గుర్తించారు. ముగ్గురు మహిళల లగేజీల నుంచి ఆగంతకులు రూ.34,800 నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. దీంతో వారు డిపో మేనేజర్ సూర్య పవన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని తాపీమేస్త్రి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రామకృష్ణాపురం ప్రాంతంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్సై డీ.నరసింహారావు బుధవారం తెలిపినవివరాలిలా ఉన్నాయి. మృతుడిని తాపీమేస్త్రి కాలనీకి చెందిన సుంకర స్మాలస్‌రాజుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు బుధవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను కోరారు. వివరాలను వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఏలూరులో బుధవారం పత్రికలకు విడుదల చేశారు. మన బడి నాడు-నేడు కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయించేందుకు కృషి చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అందరికీ న్యాయం చేయాలని కోరామన్నారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్‌కు గుర్తింపు విషయంపై ఎమ్మెల్సీ టి.కల్పలత రెడ్డి ఆధ్వర్యంలో ప్రవీణ్ ప్రకాష్ వద్ద ప్రస్తావించగా ఆయన స్పందిస్తూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్‌కు గుర్తింపునకు సంబంధించిన ఫైలును విద్యాశాఖ నుంచి జీఏడీకి పంపించామన్నారు. వైఎస్సార్ టీఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూడి రామ్మోహన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సున్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేను విజయవంతం చేయండి



కైకలూరు సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో తుతిక శ్రీనివాస విశ్వనాథ్

కైకలూరు: స్వమిత్వ పథకం కింద పంచాయతీల్లో గ్రామకంఠాలను గుర్తించే సర్వేను విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తుతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కైకలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకంపై సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సెక్రటరీలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ కైకలూరు మండలంలో రామవరం, శింగాపురం, గోపవరం గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. సర్వే చేసిన ప్రాంతాల్లో గ్రామసభలను నిర్వహించి ఆర్వోఆర్ నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులలో ఆలసత్వం వద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో కె.పూర్ణచంద్రశేఖర్, ఎంపీడీవో జి.రాంబాబు, సర్వే డెప్యూటి తహసీల్దారు ప్రసాద్, ఈవోపీఆర్‌డీ రవిశంకర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

'బాబు అండ్ కో'ను ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో ప్రాంతీయ విబేధాలు సృష్టిస్తున్న బాబు అండ్‌కోను ప్రజలు నమ్మరని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన జవాబు చెంపపెట్టు అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం అన్ని రకాలుగా పేదవాడికి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. యువగళం పేరుతో లోకేష్, వారాహి యాత్ర పేరుతో పవన్ కల్యాణ్ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు చేస్తున్న ప్రచారానికి చరమగీతం పాడాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదవాడికి జానెడు జాగా ఇచ్చి, ఇళ్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్ లక్షలాది ఇళ్లను కట్టిస్తుంటే, అక్కసుతో తప్పుడు కేసులు కోర్టులో వేసి అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడం, ఎంతవరకు సమంజసమన్నారు. బాబి, ప్రేమ్, సునీల్, అచ్చిబాబులు పాల్గొన్నారు.

నేటి నుంచి ర్యాగింగ్ నిరోధంపై అవగాహన సదస్సులు

ఏలూరు (టూటౌన్): ర్యాగింగ్ నిరోధంపై కళాశాలల్లో ప్రత్యేక బృందం ద్వారా గురువారం నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాగింగ్ నిరోధక చర్యల్లో భాగంగా ఆగస్టు 3, 7, 8, 11 తేదీలలో కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. 3న ఉదయం 11 గంటలకు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో, 7న రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో, 8న ఆశ్రం మెడికల్ కాలేజీలో, 10న సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో, 11న ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.